# ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి
# విద్యుత్ ప్రసారణ కొరకు ట్యారిఫ్‌ను నిర్ధారించుటకైన నిబంధనలు మరియు షరతులు
# 2005 లో 5వ నిబంధన
## (ఆంధ్రప్రదేశ్ అసాధారణ రాజపత్రం 2వ భాగంలో ది.30.11.2005 న ప్రచురించబడినది)

**ఉపోద్ఘాతము:**

కేంద్ర విద్యుత్ చట్టము, 2003 లోని 61వ పరిచ్ఛేధము (సెక్షను) లోని నిబంధనలు, ట్యారిఫ్ నిర్ధారణ కొరకు సంబంధిత మండలి నిబంధనలను మరియు షరతులను నిర్ధిష్ట పరచవలెనని తెలుపుతున్నవి. చట్టంలోని 62వ పరిచ్ఛేధము విద్యుత్ ప్రసారణ కొరకు ట్యారిఫ్‌ను నిర్ధారించుటకొరకు మండలికి అధికారమును ఇస్తున్నది మరియు అనుమతిదారుడు తనకు అనుమతించబడిన ట్యారిఫ్ మరియు చార్జీల ద్వారా ఆశిస్తున్న ఆదాయమును లెక్కించుట కొరకు మండలి నిర్ధిష్టపరచిన కార్య విధానమును పాటించవలెనని అనుమతిదారులను కోరుతున్నది. ప్రసారణ ట్యారిఫ్ కొరకు నిబంధనలు మరియు షరతులను, ఆశిస్తున్న ఆదాయమును లెక్కించుట కొరకు కార్యవిధానమును నిర్ధిష్టపరుస్తూ మండలి, ముసాయిదా నిబంధనను తయారుచేయడమైనది. దీనిని ది.18.10.2005న ఆంధ్రప్రదేశ్ రాజపత్రములో ప్రచురించి, ప్రజానీకం నుండి, లబ్దిదారుల నుండి సలహాలను/సూచనలను కోరుతూ పత్రికా ప్రకటనను జారీచేయడమైనది. మండలి వెబ్‌సైటులో కూడా దీనిని ఉంచడమైనది. ఒక వ్యక్తి నుండి మరియు ఏ.పి. ట్రాన్స్‌కో నుండి సూచనలు/సలహాలు అందినవి. మండలి ఆ సూచనలు/ సలహాలను పరిశీలించి, సముచితమైనవిగా భావించిన మార్పులు చేసి నిబంధనను అంతిమముగా తయారుచేసినది.

కేంద్ర విద్యుత్ చట్టము, 2003 (2003 లో 36వ చట్టము) లోని పరిచ్ఛేధము 181 (2) లోని ఖండములు (జెడ్‌డి) మరియు (జెడ్‌ఎఫ్) మరియు పరిచ్ఛేధములు 61, 62ల ద్వారా లభించిన అధికారములను మరియు ఈ విషయంలో లభించే అన్ని ఇతర అధికారములను వినియోగిస్తూ, ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి ఈ క్రింది నిబంధనను జారీ చేయడమైనది, అదేదనగా;-

## భాగము-I
## ప్రారంభిక

**1. సంగ్రహ నామము, వర్తింపు మరియు ప్రారంభము:**

(i) ఈ నిబంధనను ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ప్రసారణ ట్యారిఫ్ నిర్ధారణ కొరకు నిబంధనలు మరియు షరతులు) నిబంధన, 2005 అని పేర్కొనవచ్చును.

(ii) ఈ నిబంధన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రాంతము లోపల విద్యుత్ ప్రసారణ వ్యాపారమును నిర్వహించుచున్న వ్యక్తికి వర్తించును.

(iii) ఈ నిబంధన ఆంధ్రప్రదేశ్ రాజ పత్రములో అది ప్రచురించబడిన తేదీ నుండి అమలులోనికి వచ్చును.

**2. నిర్వచనములు, అర్థాన్వయము:**

(i) ఈ నిబంధనలో సందర్భమును బట్టి వేరే అర్థము ఉన్ననే తప్ప;-

(ఏ) "చట్టము" అనగా కేంద్ర విద్యుత్ చట్టము, 2003 (2003 లో 36వ చట్టము) అని అర్థము;

(బి) "సమగ్ర ఆదాయ అవసరం" (ఏ.ఆర్.ఆర్.) అనగా అనుమతి పొందిన వ్యాపారమునకు సంబంధించి ఒక ఆర్థిక సంవత్సరానికి ఖర్చులను భరించుటకు అవసరమైన ఆదాయము అని అర్థము. దీనిని ట్యారిఫ్‌లు మరియు చార్జీల రూపంలో వసూలు చేయుటకు మండలిచే అనుమతించబడవలెను;

(సి) "ఆధార సంవత్సరము" అనగా నియంత్రణ వ్యవధిలోని మొదటి సంవత్సరానికి ముందు ఆర్థిక సంవత్సరము అని అర్థము;

(డి) "సి.ఇ.ఆర్.సి." అనగా చట్టంలోని 76వ పరిచ్ఛేధము క్రింద స్థాపించబడిన కేంద్ర విద్యుత్ నియంత్రణ మండలి అని అర్థము;

(ఇ) "మండలి" అనగా ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి అని అర్థము;

(ఎఫ్) "కార్య నిర్వహణ నిబంధనలు" అనగా ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (కార్య నిర్వహణ) నిబంధనలు అని అర్థము;

(జి) "వినియోగదారుని/వాడకందారుని వాటా విరాళం" అనగా అనుమతిదారుని యొక్క ప్రసారణ నెట్ వర్కును వినియోగించుచున్న లేక వినియోగించదలచిన వ్యక్తులు అందించు వాటా విరాళం అని అర్థము; అనుమతిదారులు పొందిన ఏదేని గ్రాంటు కూడా వినియోగదారుని/వాడకందారుని వాటా విరాళంగా భావించబడును;

(హెచ్) "నియంత్రణ వ్యవధి" అనగా మండలిచే ఆయా సమయములందు నిర్ణయించబడు బహుళ -వార్షిక వ్యవధి. సాధారణంగా అయిదు సంవత్సరాలకు ఆదాయ అవసరాల నిర్ధారణ సూత్రాలు నిర్ణయించబడతాయి. అయితే ఇందులో మొదటి నియంత్రణ వ్యవధి మూడు సంవత్సరాల కాలం ఉంటుంది;

(ఐ) "ఆర్థిక సంవత్సరం" అనగా క్యాలండరు సంవత్సరంలో ఏప్రియల్ 1వ తేదీతో ప్రారంభమై తదుపరి క్యాలండరు సంవత్సరంలో మార్చి 31వ తేదీతో ముగిసే వ్యవధి అని అర్థము;

(జె) "గ్రిడ్ కోడు" అనగా మండలి ఆమోదించిన రాష్ట్ర గ్రిడ్ కోడు అని అర్థము;

(కె) "ట్యారిఫ్ యేతర ఆదాయము" అనగా అనుమతిపొందిన వ్యాపారమునకు సంబంధించి ప్రసారణ ట్యారిఫ్‌ల నుండి కాకుండా వచ్చే ఇతర ఆదాయము అని అర్థము; ఇతర వ్యాపారం నుండి వచ్చే ఆదాయం ఇందులో చేరియుండదు.

(ఎల్) "అనుమతి" (లైసెన్సు) అనగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోపల విద్యుత్తును ప్రసారము చేయుటకు చట్టం యొక్క 14వ పరిచ్ఛేధము క్రింద మంజూరైన అనుమతి అని అర్థము;

(ఎమ్) ”అనుమతిదారుడు” అనగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోపల విద్యుత్ ప్రసారణ కొరకు చట్టం యొక్క 14వ పరిచ్ఛేధము క్రింద ప్రసారణ అనుమతిదారుగా అనుమతి పొందిన వ్యక్తి అని అర్ధము;

(ఎన్) ”ఓపెన్ యాక్సెస్ ఒప్పందము” అనగా విద్యుత్ ప్రసారణ కొరకు ప్రసారణ అనుమతిదారుని యొక్క నెట్ వర్కును ఓపెన్ యాక్సెస్ ద్వారా వినియోగించుకొనుటకు ఓపెన్ యాక్సెస్ నిబంధనల క్రింద ప్రసారణ అనుమతిదారుకు, వాడకందారుకు మధ్య కుదుర్చుకొన్న ఒప్పందము అని అర్ధము; అట్టి ఒప్పందములో పంపిణీ అనుమతిదారుడు కూడా ఒక భాగస్వామిగా చేరియుండవచ్చును.

(ఓ) ”ఓపెన్ యాక్సెస్ నిబంధన” అనగా ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఓపెన్ యాక్సెస్ నిబంధనలు మరియు షరతులు) నిబంధన, 2005 (2005 లో 2వ నిబంధన) అని అర్ధము;

(పి) ”ఇతర వ్యాపారము” అనగా ప్రసారణ అనుమతిదారుని యొక్క ఆస్తులను వీలైనంత ఎక్కువ మేరకు ఉపయోగించుకొనుటకుగాను చట్టం యొక్క 41వ పరిచ్ఛేధము క్రింద ప్రసారణ అనుమతిదారుడు నిర్వహించు ఏదేని వ్యాపారము అని అర్ధము; ఇందులో అనుమతి పొందిన వ్యాపారం కాకుండా ప్రసారణ అనుమతిదారుడు చేయు ఏదేని వ్యాపారము చేరి యుండును;

(క్యు) ”రెగ్యులేటెడ్ రేట్ బేస్” లేక ”ఆర్.ఆర్.బి.” అనగా వినియోగదారుల చందాలు మరియు జమ అయిన తరుగుదల పోను నికర స్థిరాస్తుల విలువ అని అర్ధము;

(ఆర్) ”రాష్ట్రము” అనగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రము అని అర్ధము;

(ఎస్) ”ఎస్.ఎల్.డి.సి.” లేక ”రాష్ట్ర లోడు విడుదల కేంద్రము” అనగా చట్టం యొక్క 31వ పరిచ్ఛేధము క్రింద స్థాపించబడిన కేంద్రము అని అర్ధము;

(టి) ”ప్రసారణ వ్యాపారము” అనగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోపల చేయు విద్యుత్ ప్రసారణ వ్యాపారము అని అర్ధము;

(యు) ”వాడకందారుడు” లేక ”ఓపెన్ యాక్సెస్ వాడకందారుడు” అనగా తన సరఫరా ప్రాంతంలోని పంపిణీ అనుమతిదారుకానట్టి ఇతర వ్యక్తి నుండి విద్యుత్ సరఫరా పొందుటకొరకు రాష్ట్రంలోని ప్రసారణ అనుమతిదారుని యొక్క ప్రసారణ వ్యవస్థను వినియోగించుకొనుచున్న లేక వినియోగించదలచిన వ్యక్తి అని అర్ధము; మరియు ఈ పదబంధములో ప్రసారణ వ్యవస్థను వినియోగించుకొను పంపిణీ అనుమతిదారులతో సహా ఉత్పాదన కంపెనీ మరియు అనుమతిదారులు చేరియుందురు.

(ii) ఈ నిబంధనలో ఉపయోగించబడి, నిర్వచించబడని పదములు, పదబంధములు, చట్టములో నిర్వచించబడినట్లయితే, చట్టములో వాటికి ఉన్న అర్ధములనే కలిగియుండును.

(iii) ఈ నిబంధన క్రింద వ్యవహారములన్నీ ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (కార్య నిర్వహణ) నిబంధనల ద్వారా వ్యవహరించబడును.

**3. వర్తింపు పరిధి:**

3.1 ఈ నిబంధన రాష్ట్రంలోని ప్రసారణ అనుమతిదారులందరికీ వర్తించును.

3.2 ఈ నిబంధనలో పొందుపరచిన సూత్రములననుసరించి మండలి, ప్రసారణ అనుమతిదారు యొక్క ప్రసారణ వ్యాపారానికి సంబంధించి ఏ.ఆర్.ఆర్.ను నిర్ధారించవలెను.

3.3 పైన 3.2 ప్రకారం నిర్ధారించిన ఏ.ఆర్.ఆర్. విద్యుత్ ప్రసారణ ట్యారిఫ్‌ను/చార్జీలను నిర్ణయించుటకు ఆధారమగును.

## భాగము-II

## దృక్కోణము, స్వరూపం, కార్యవిధానములు మరియు దాఖలు

**4. సమగ్ర ఆదాయ అవసరాన్ని లెక్కించుట కొరకు మార్గదర్శకములు:**

సమగ్ర ఆదాయ అవసరం/చార్జీల ద్వారా ఆశిస్తున్న ఆదాయం (ఏ.ఆర్.ఆర్./ఇ.ఆర్.సి.) లను లెక్కించుట కొరకు కొత్తగా మార్గదర్శకాలను జారీ చేసేటంతవరకూ, ప్రస్తుతం మండలి జారీ చేసిన మార్గదర్శకాలు ఇందులో మార్పులు చేయబడిన విధంగా ప్రసారణ వ్యాపారానికి వర్తించుట కొనసాగును.

**5. అక్కౌంట్లను వేరుచేయుట:**

ఎస్.ఎల్.డి.సి. కార్యకలాపాలకు మరియు ప్రసారణ కార్యకలాపాలకు మధ్య అక్కౌంట్లను పూర్తిగా వేరుపరచేవరకూ, ప్రసారణ అనుమతిదారు, తన ఖర్చులను కేటాయింపు వివరణ ఆధారంగా (i) ఎస్.ఎల్.డి.సి. కార్యకలాపాలకు మరియు (ii) ప్రసారణ కార్యకలాపాలకు మధ్య పంచవలెను. కేటాయింపు వివరణలో అట్లు పంచుటకు అనుసరించిన పద్ధతిని కూడా చేర్చవలెను.

**6. దాఖలు చేయు విధానము:**

6.1 ప్రతి ప్రసారణ అనుమతిదారుడు, నియంత్రణ వ్యవధిలోని ప్రతి సంవత్సరానికి సమగ్ర ఆదాయ అవసరం (ఏ.ఆర్.ఆర్.) ఆమోదం కొరకు దరఖాస్తు చేయవలెను. దీనిని నియంత్రణ వ్యవధిలోని మొదటి సంవత్సరం ప్రారంభమగుటకు 120 రోజుల ముందుగా పంపవలెను. ఈ దఖలు నిర్ణీతపరచిన ప్రరూపంలోనూ, అట్టి రీతిలోనూ మరియు మండలి జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారంగానూ ఉండవలెను. ప్రసారణ అనుమతిదారుడు మొదటి నియంత్రణ వ్యవధికి సంబంధించిన ఏ.ఆర్.ఆర్. ఆమోదం కొరకు ఆ నియంత్రణ వ్యవధి ప్రారంభమునకు 90 రోజులు ముందుగా అట్టి దరఖాస్తులను దాఖలు చేయవచ్చును. దఖళ్ళను పూర్తి నియంత్రణ వ్యవధికి సమర్పించవలెను.

**6.2 ప్రసారణ వ్యాపారం కొరకు ఏ.ఆర్.ఆర్.:**

ఏ.ఆర్.ఆర్. దఖళ్ళలో ఈ క్రింది అంశములు ఉండవలెను:-

(ఏ) ఆధార సంవత్సరానికి, దాని ముందు సంవత్సరానికి అంచనా వేసిన పని మరియు నిర్వహణ (ఓ & ఎమ్) ఖర్చులు, ఇందులో ఉద్యోగి సంబంధిత ఖర్చులు, మరమ్మత్తులు & నిర్వహణ ఖర్చులు మరియు పరిపాలన & సాధారణ ఖర్చులు చేరి ఉండును. దీనితోపాటుగా ప్రసారణ అనుమతిదారుడు ప్రతిపాదించిన ప్రమాణాల ఆధారంగా నియంత్రణ వ్యవధిలోని ప్రతి సంవత్సరానికి భవిష్యత్తు అంచనా, ఈ నిబంధనలో ఓ & ఎమ్ ఖర్చు భత్యము కొరకు వివరించిన సూత్రముల ప్రకారం ఇండక్సేషను మరియు ఇతర సముచిత వ్యవస్థలు చేరియుండును.

(బి) ఆధార సంవత్సరానికి మరియు నియంత్రణ వ్యవధిలోని ప్రతి సంవత్సరానికి రెగ్యులేటెడ్ రేట్ బేస్ (ఆర్.ఆర్.బి.). దీని కొరకు నిర్వహణ మూలధనం అవసరాన్ని మరియు మండలి యొక్క ఆమోదిత వనరుల ప్రణాళికకు అనుగుణంగా నియంత్రణ వ్యవధిలోని ప్రతి సంవత్సరానికి మూలధనీకరణ (క్యాపిటలైజేషను) షెడ్యూల్‌తో పాటుగా పథకము/ప్రోజెక్టు వారీగా సవివరమైన మూలధన పెట్టుబడి ప్రణాళికను సమర్పించవలసి ఉంటుంది.

(సి) సరియైన పెట్టుబడి స్వరూపం కొరకు ప్రతిపాదన మరియు మూలధన సగటు మూల్యాన్ని లెక్కించుట కొరకు దాని ఆర్థిక ఖర్చు (వడ్డీ ఖర్చు మరియు ఈక్విటీపై ప్రతిఫలం).

(డి) ప్రోత్సాహకాలు/జరిమానాల నిమిత్తం నియంత్రణ వ్యవధిలోని ప్రతి సంవత్సరానికీ (గరిష్ట మరియు కనిష్ట స్థాయిలలో) ప్రసారణ నష్టాల పరిధి.

(ఇ) తరుగుదల వివరములు, తరుగుదలపై ముందు చెల్లింపుతో సహా, మరియు నియంత్రణ వ్యవధిలోని ప్రతి సంవత్సరానికి సంబంధించి మూలధనంగా మార్చే (నిర్ణీత సమయాలు) షెడ్యూలు.

(ఎఫ్) ఇండక్సేషనులో ఉపయోగించుటకు ప్రతిపాదించిన బాహ్య ప్రమాణ సూచికల వివరణ.

(జి) ఆదాయంపై పన్నుల వివరములు.

(హెచ్) సంబంధిత ఇతర వ్యయము.

(ఐ) లాభనష్టాలను పంచుకొనుటకు ప్రతిపాదనలు.

(జె) సామర్థ్య ప్రమాణ లక్ష్యాలకు ప్రతిపాదనలు.

(కె) పనిలో సామర్థ్యం చూపినందుకు ప్రతిఫలమునిచ్చుటకు ప్రతిపాదనలు.

(ఎల్) సముచితమని భావించిన ఏవేని ఇతర విషయములు.

**7. ప్రతిపాదిత ట్యారిఫ్ కొరకు దాఖలు: (ఎఫ్.పి.టి.):**

**7.1** విద్యుత్ ప్రసారణ కొరకు ట్యారిఫ్/చార్జీల నిర్ధారణకై అనగా, ప్రసారణ వ్యాపారం కొరకు ఏ.ఆర్.ఆర్.ను వసూలు చేయుటకై ప్రసారణ ట్యారిఫ్/చార్జీలకై ప్రతిపాదిత ట్యారిఫ్ దాఖలును ఏ.ఆర్.ఆర్.తో పాటుగా దాఖలు చేయవలెను.

**7.2** ఎఫ్.పి.టి. దరఖాస్తులో ఈ క్రింది వాటిని చేర్చవలెను:-

(i) వనరుల ప్రణాళికకు అనుగుణంగా నియంత్రణ వ్యవధిలోని ప్రతి సంవత్సరానికి సంబంధించి ప్రసారణ వ్యవస్థ లేక నెట్‌వర్క్ యొక్క భవిష్యత్తు వినియోగము;

(ii) నియంత్రణ వ్యవధిలోని ప్రతి సంవత్సరానికి విద్యుత్ ప్రసారణ కొరకు ట్యారిఫ్‌లను లెక్కించుట కొరకు ప్రతిపాదనలు. ఇందులో, వస్తు రూపంలో చార్జి చేయవలసిన నష్టాలు మరియు దానికి సంబంధించిన కార్య విధానము చేరియుండవలెను;

(iii) అంశము వారీ వివరణలతో ట్యారిఫ్ యేతర ఆదాయము కొరకు ప్రతిపాదనలు;

(iv) ఇతర వ్యాపారం నుండి వచ్చే ఆదాయానికి సంబంధించిన ప్రతిపాదనలు;

(v) ప్రతిపాదించిన ప్రసారణ చార్జీలు, ట్యారిఫ్ యేతర ఆదాయము మరియు ఇతర వ్యాపారము (ల) నుండి ఆదాయముల ద్వారా ఆశిస్తున్న రెవెన్యూ (ఆదాయము).

**8. దరఖాస్తుల పరిష్కారం:**

**8.1** మండలి, ఈ నిబంధన ప్రకారం మరియు తన కార్య నిర్వహణ నిబంధనల ప్రకారం ప్రసారణ అనుమతిదారుడు సమర్పించిన దఖళ్ళను పరిశీలించవలెను.

**8.2** ప్రసారణ అనుమతిదారుడు సమర్పించిన ప్రతిపాదనలు, ప్రజల నుండి మరియు ఇతర లబ్దిదారుల నుండి అందిన అభ్యంతరాలు/సూచనలు ఆధారంగా, అట్టి మార్పులు చేస్తూ మరియు/లేక సబబని భావించినట్టి షరతులను విధిస్తూ, మండలి దరఖాస్తును ఆమోదించవచ్చును. దరఖాస్తు అందిన 120 రోజుల లోపల (ఖండము 6.1 లోని నిబంధనల ప్రకారం మొదటి నియంత్రణ వ్యవధికి దాఖలు చేసిన దరఖాస్తు విషయంలో 90 రోజుల లోపల), నియంత్రించగలిగిన అంశాల కొరకు లక్ష్యాలు, ఆమోదించిన ఏ.ఆర్.ఆర్., నికర ఏ.ఆర్.ఆర్. మరియు ప్రసారణ వ్యాపారానికి సంబంధించి ప్రసారణ ట్యారిఫ్‌లు మరియు ఇతర విషయములతో కూడిన ఉత్తరువును మండలి జారీ చేయవచ్చును.

**8.3** ఖండము 8.2 క్రింద నిర్ధారించిన ఏ.ఆర్.ఆర్. నుండి, ఖండము 19 ప్రకారం నిర్ధారించిన ట్యారిఫ్ యేతర ఆదాయము మరియు ఇతర వ్యాపారం నుండి, ఏదైనా ఉన్నట్లయితే, నికర ఆదాయమును తీసివేసిన మీదట రాబోయే సంవత్సరానికి గాను వసూలు చేయుటకు అనుమతిదారుకు అర్హమైన నికర ఏ.ఆర్.ఆర్. ను నిర్ధారించవలెను.

**9. వనరుల ప్రణాళిక:**

ప్రసారణ అనుమతిదారుడు, నియంత్రణ వ్యవధిలోని మొదటి సంవత్సరానికి ముందు సంవత్సరంలో ఏప్రియల్ 1వ తేదీన వనరుల ప్రణాళికను మండలి ఆమోదం కొరకు దాఖలు చేయవలెను.

**9.1** భవిష్యత్తు లోడు మరియు వనరుల ప్రణాళికపై మండలి ఆయా సమయముల యందు సవరించి జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా వనరుల ప్రణాళికలో భవిష్యత్తు లోడు మరియు ప్రసారణ ప్రణాళిక, మూలధన పెట్టుబడి ప్రణాళిక ఉండవలెను:

అయితే, మొదటి నియంత్రణ వ్యవధికి చెందిన వనరుల ప్రణాళికను, మొదటి నియంత్రణ వ్యవధి ఏ.ఆర్.ఆర్. కు సంబంధించిన బహుళ వార్షిక దఖళ్ళతో పాటుగా దాఖలు చేయవలెను.

**9.2** మండలి, భవిష్యత్తు లోడు, వనరుల ప్రణాళిక (ప్రసారణ ప్రణాళిక) లపై జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం వనరుల ప్రణాళికను ఆమోదించవలెను. ప్రసారణ అనుమతిదారుడు దానిని నియంత్రణ వ్యవధికి చెందిన బహుళ సంవత్సర దఖళ్ళలో అనుసరించవలెను.

**10. బహుళ వార్షిక ట్యారిఫ్ స్వరూపము మరియు దృక్కోణము (అప్రోచ్):**

**10.1** సమగ్ర ఆదాయ అవసరం (ఏ.ఆర్.ఆర్.) ను మరియు ట్యారిఫ్ మరియు చార్జీల నుండి ఆశిస్తున్న ఆదాయాన్ని లెక్కించుట కొరకు ఈ క్రింది దృక్కోణంలో బహుళ వార్షిక ట్యారిఫ్ స్వరూపం ఉండవలెను.

**10.2 ఆధార సంవత్సరం (బేస్ ఇయర్):**

అందుబాటులో ఉన్న ఆడిటు అయిన ఆక్కౌంట్లు, సంబంధిత సంవత్సరాలలోని ఉత్తమమైన అంచనాలు మరియు మండలి సముచితమని భావించిన ఇతర విషయాల ఆధారంగానూ మరియు వివిధ అంశాల స్వభావాన్ని బట్టి అవి నియంత్రించగలిగినవా? లేక నియంత్రించజాలనివా? అని నిర్ధారించు పరీక్షలు జరిపిన మీదటనూ నియంత్రణ వ్యవధికి సంబంధించిన ఆధార సంవత్సరం లోని విలువలను నిర్ధారించవలెను. సాధారణంగా ఆడిటు జరగని అక్కౌంట్లలోని విలువల ఆధారంగా లక్ష్యాలు నిర్ణయించబడినప్పటికీ, మండలి పనితీరు ప్రమాణాలను తిరిగి పరిశీలించదు.

**10.3 లక్ష్యాలు:**

మండలి, నియంత్రించగలవిగా భావించిన అంశాలకే లక్ష్యాలను ఏర్పరచటం జరుగుతుంది. దరఖాస్తుదారు యొక్క పనితీరును ప్రోత్సాహకాలు మరియు నిరుత్సాహకాల ద్వారా మెరుగుపరచవలసినప్పుడు, మండలి, నిర్దిష్టమైన చలన అంశముల కొరకు గతిపథం (ట్రాజెక్టరీ) ను ఏర్పరచవచ్చును.

**10.4 ఏ.ఆర్.ఆర్. లో నియంత్రించగల మరియు నియంత్రించజాలని అంశములు:**

ప్రసారణ అనుమతిదారుని యొక్క వ్యయాన్ని ఈ క్రింది విధంగా "నియంత్రించజాలని" మరియు "నియంత్రించగల" అంశములుగా పరిగణించవచ్చును:-

| ప్రసారణ వ్యాపారము | |
|---|---|
| ఏ.ఆర్.ఆర్. అంశము | నియంత్రించగలది/నియంత్రింపజాలనిది |
| పని & నిర్వహణ ఖర్చులు | నియంత్రించగలది |
| పెట్టిన పెట్టుబడిపై ప్రతిఫలం | నియంత్రించగలది |
| తరుగుదల | నియంత్రించగలది |
| ఆదాయంపై పన్నులు | నియంత్రింపజాలనిది |
| ట్యారిఫ్ యేతర ఆదాయం | నియంత్రించగలది |

**10.5 ఏ.ఆర్.ఆర్. లోని ''నియంత్రింపజాలని'' అంశాలలో లాభనష్టాలపై వ్యత్యాసములను పాస్-త్రూ చేయుట:-**

నియంత్రింపజాలని అంశాల ప్రభావానికి సంబంధించి వాస్తవ సమాచారం అందుబాటులో ఉన్నట్లయితే, నియంత్రణ వ్యవధికి సంబంధించిన ఏ.ఆర్.ఆర్. లో నియంత్రింపజాలని అంశాల వ్యత్యాసాన్ని క్లెయిము చేయుటకు ప్రసారణ అనుమతిదారుకు అర్హత ఉండును:

అయితే, మండలి, ట్రూఅప్ బకాయి పడటానికి మరియు వాస్తవంగా అనుమతించడానికీ మధ్య వ్యవధి కారణంగా ఆర్థిక ఖర్చును అనుమతించవలెను మరియు ఈ దిద్దుబాట్లు సాధారణంగా పునరావృతంకారాదు.

**10.6 ఏ.ఆర్.ఆర్. లోని ''నియంత్రించగల'' అంశాలలో లాభనష్టాలపై వ్యత్యాసాలు:**

ప్రసారణ అనుమతిదారు, నియంత్రణ వ్యవధికి సంబంధించి తన దాఖళ్ళలో ఏ.ఆర్.ఆర్. లోని ప్రతి నియంత్రించగల అంశానికి సంబంధించి గత నియంత్రణ వ్యవధిలోని లాభనష్టాలను చూపవలెను. నియంత్రింపజాలని అంశాల కారణంగా ఏవేని వ్యత్యాసాలను సర్దుబాటు చేసిన మీదట, నియంత్రించగల ప్రతి అంశానికి లాభనష్టాల వివరణను సమర్పించవలెను.

**10.7** వాడకందార్లతో లాభనష్టాలను పంచుకొనే నిమిత్తం, నియంత్రణ వ్యవధి మొత్తానికి పూర్తి లాభనష్టాలను పరిగణన లోనికి తీసుకొనవలెను. మండలి, ఏ.ఆర్.ఆర్. లోని ప్రతి అంశానికి లాభనష్టాలను సమీక్షించి అవసరమైన చోట సముచితమైన సర్దుబాట్లను చేయవలెను;

**10.8** ఈ నిబంధనలో ఏమి ఉన్నప్పటికినీ, నియంత్రణలో లేని అంశాల కారణంగా ఏ.ఆర్.ఆర్. లో నియంత్రించగల అంశాలలోని లాభనష్టాలను, మండలి ఉత్తరువులో నిర్ధిష్టపరచిన విధంగా అట్టి వ్యవధికి ఏ.ఆర్.ఆర్. లో అదనపు ఛార్జీగా లేక రిబేటుగా ఆమోదించవలెను.

## భాగము-III

## సమగ్ర ఆదాయ అవసరాన్ని లెక్కించుటకు సూత్రాలు

**11. ఏ.ఆర్.ఆర్. లో ప్రధాన అంశాలు:**

నియంత్రణ వ్యవధిలోని ప్రతి సంవత్సరానికీ, ప్రసారణ అనుమతిదారు (ఎస్.ఎల్.డి.సి. ని మినహాయించి) దాఖలు చేసే ఏ.ఆర్.ఆర్. లో ఈ క్రింది అంశములు ఉండవలెను:-

(ఏ) పని మరియు నిర్వహణ ఖర్చులు;

(బి) పెట్టిన పెట్టుబడిపై ప్రతిఫలం;

(సి) తరుగుదల;

(డి) ఆదాయంపై పన్నులు;

(ఇ) ''నియంత్రింపజాలని'' అంశములు మరియు ''నియంత్రించగల'' అంశములలో దిద్దుబాట్లు;

(ఎఫ్) ఏదేని ఇతర సంబంధిత వ్యయం.

**12. పని మరియు నిర్వహణ ఖర్చులు:**

**12.1** అనుమతిదారుడు, నియంత్రణ వ్యవధికి సంబంధించిన తన దఖళ్ళలో, నియంత్రణ వ్యవధికి సంబంధించిన ఆధార సంవత్సరానికి మరియు దానికి ముందు రెండు సంవత్సరాలకు చెందిన పూర్తి ఓ&ఎమ్ ఖర్చుల వాస్తవ అంచనాలు మరియు సంబంధించినవిగా భావించిన ఇతర అంశాల ఆధారంగా ఆధార సంవత్సరంలోని ఓ&ఎమ్ ఖర్చులను నిర్ధారించాలి. అవసరమైతే, ఆధార సంవత్సరంలోని ఓ&ఎమ్ ఖర్చులను నియంత్రణ వ్యవధిలోని ప్రతి సంవత్సరానికీ ఖర్చులను అంచనా వేయటంలో ఉపయోగించాలి.

ఈ క్రింద తెలిపిన ఫార్ములా ప్రకారం, మండలి, నియంత్రణ వ్యవధిలోని ప్రతి సంవత్సరానికీ అనుమతించబడు ఓ&ఎమ్ ఖర్చుల మొత్తమును నిర్ధారించవలెను:

ఓ&ఎమ్ ఎల్$_0$ = 0.3** ఓ&ఎమ్$_0$ /ఎల్ఎల్$_0$

ఓ&ఎమ్ ఎస్$_0$ = 0.7* ఓ&ఎమ్$_0$ / ఎస్ఎస్$_0$

ఓ&ఎమ్ ఎల్$_{\text{ఎన్}}$ = ఓ&ఎమ్ ఎల్$_{\text{ఎన్}-1}$ * ఐఎన్‌డిఎక్స్

ఓ&ఎమ్ ఎస్$_{\text{ఎన్}}$ = ఓ&ఎమ్ ఎస్$_{\text{ఎన్}-1}$ * ఐఎన్‌డిఎక్స్

ఓ&ఎమ్$_{\text{ఎన్}}$ = ఓ&ఎమ్ ఎల్$_{\text{ఎన్}}$ * ఎల్ ఎల్$_{\text{ఎన్}}$ + ఓ&ఎమ్ ఎస్$_{\text{ఎన్}}$ * ఎస్ ఎస్$_{\text{ఎన్}}$

ఇందులో

ఓ&ఎమ్ ఎల్$_0$ అనగా మొదటి నియంత్రణ వ్యవధి కొరకు ఇ.హెచ్.టి. (అదనపు హైటెన్షను) లైన్లకు సంబంధించి సి.కె.టి. – కె.ఎమ్. (సర్క్యూట్ – కిలోమీటర్లు) కు ఓ&ఎమ్ ఖర్చు.

ఓ&ఎమ్ ఎస్$_0$ అనగా, మొదటి నియంత్రణ వ్యవధికి చెందిన ఆధార సంవత్సరానికి సబ్ స్టేషన్ల బే కొరకు ఓ&ఎమ్ ఖర్చు.

**గమనిక:** రెండవ మరియు తదుపరి నియంత్రణ వ్యవధుల ఆధార సంవత్సరమునకు సంబంధించి సి.కె.టి. – కె.ఎమ్. లైన్లకు మరియు సబ్ స్టేషను బేకు అయ్యే ఓ&ఎమ్ ఖర్చును, అనుమతిదారు వేరువేరుగా దాఖలు చేసే లైన్ల మరియు సబ్ స్టేషన్ల వాస్తవ ఓ&ఎమ్ ఖర్చు ఆధారంగా నిర్ధారించవలెను.

ఓ&ఎమ్ ఎల్$_{\text{ఎన్}}$ అనగా సంవత్సరం 'ఎన్' లో ఇ.హెచ్.టి. లైన్ల సి.కె.టి. – కె.ఎమ్ ఒక్కంటికి అయ్యే ఓ&ఎమ్ ఖర్చు.

ఓ&ఎమ్ ఎస్$_{\text{ఎన్}}$ అనగా సంవత్సరం 'ఎన్' లో బే ఒక్కింటికి అయ్యే ఓ&ఎమ్ ఖర్చు.

ఎమ్ ఎల్$_{\text{ఎన్}}$ అనగా సంవత్సరం "ఎన్" లో సి.కె.టి. – కె.ఎమ్. లలో ఇ.హెచ్.టి. లైన్ల సంచయన పొడవు.

ఎస్ ఎస్$_{\text{ఎన్}}$ అనగా సంవత్సరం "ఎన్" లో ఇ.హెచ్.టి. సబ్ స్టేషన్ బేల సంఖ్య

ఐఎన్‌డిఎక్స్ అనగా ద్రవ్యోల్బణ అంశము.

**13. పెట్టిన పెట్టుబడిపై ప్రతిఫలం:**

**13.1** సంవత్సరము 'i' లో ఆర్.ఆర్.బి. కొరకు పెట్టిన పెట్టుబడిపై ప్రతిఫలమును (ఆర్.ఓ.సి.ఇ.) ని ఈ క్రింది పద్ధతిలో లెక్కించవలెను:

ఇందులో,

ఐ.ఎన్.వి$_i$ : నియంత్రణ వ్యవధిలోని సంవత్సరం "i" లో మూలధనంగా మార్చబడిన పెట్టుబడులు ఆమోదించిన విధంగా

డి$_i$ : నియంత్రణ వ్యవధిలోని సంవత్సరం "i" లో స్థిరాస్తుల తరుగుదల కారణంగా తొలగించిన లేక మాఫీ చేసిన మొత్తము.

సిసి$_i$ :Δఆర్.ఏ.బి.$_i$ కి సంబంధించిన వాడకందారుని చందాలు మరియు నియంత్రణ వ్యవధిలోని "i" సంవత్సరంలో, సర్వీసు లైన్ల నిర్మాణము లేక స్థిరాస్తులను పొందుటకు అందిన క్యాపిటలు గ్రాంట్లు / సబ్సిడీలు.

ఆర్.ఆర్.బి.$_{i-1}$ : నియంత్రణ వ్యవధిలోని సంవత్సరం "i" కి మందరి ఆర్థిక సంవత్సరానికి రెగ్యులేటెడు రేట్ బేస్. దీనిని ఈ నిబంధనలోని ఖండము 14.1 లో పేర్కొన్న ఆమోదిత మూలధన పెట్టుబడి ప్రణాళిక ఆధారంగా నిర్ధారించవలెను. నియంత్రణ వ్యవధిలోని మొదటి సంవత్సరానికి, ఆర్.ఆర్.బి.$_{i-1}$, ఆధార సంవత్సరానికి, అనగా ఆర్.ఆర్.బి.$_0$ కి రెగ్యులేటెడు రేట్ బేస్ గా ఉంటుంది. ఆధార సంవత్సరం కొరకు విలువలను, అందుబాటులో ఉన్న తాజాగా ఆడిటు అయిన అక్కౌంట్లు, సంబంధిత సంవత్సరాలకు చెందిన వాస్తవ అంచనాలు మరియు సంబంధించినవిగా మండలి భావించిన ఏవేని ఇతర అంశాలు ఆధారంగా నిర్ధారించవలెను.

ఆర్.ఆర్.బి.$_0$ = ఓ.సి.ఎఫ్.ఏ.$_0$ – ఏ.డి.$_0$ – సి.సి.$_0$

ఇందులో;–

ఓ.సి.ఎఫ్.ఏ.$_0$: అనుమతిపొందిన వ్యాపారం కొరకు ఆధార సంవత్సరానికి చివరలో అందుబాటులో ఉన్న మరియు అవసరమైన స్థిరాస్తుల ప్రారంభ విలువ.

ఏ.డి.$_0$ : ఆధార సంవత్సరం చివరిలో నియంత్రిత వ్యాపారానికి సంబంధించిన స్థిరాస్తుల అరుగుదల మరియు అరుగుదల కోసం ఇచ్చే అడ్వాన్సు కారణంగా మాఫీ చేసిన లేక తొలగించిన మొత్తములు.

సి.సి.$_0$: ఓ.సి.ఎఫ్.$_0$ కి సంబంధించిన మొత్తం చందాలు ప్రసారణ అనుమతిదారునిచే పంపిణీ / లైన్ల నిర్మాణము కొరకు వాడకందార్లు చెల్లించినవి. ఇందులో ఈ ప్రయోజనం నిమిత్తం అందిన క్యాపిటలు గ్రాంట్లు / సబ్సిడీలు కూడా చేరియుండును.

* డబ్ల్యుసి i : నియంత్రణ వ్యవధిలోని సంవత్సరం "i" లో అవసరమైన నిర్వహణ మూలధనం. దీనిని ఆ సంవత్సరానికి అనుమతించిన నిర్వహణ మరియు పోషణ వ్యయాలు మరియు ఓ&ఎమ్ స్టోర్సు యొక్క సముచిత జాబితా నిర్వహణ యొక్క జరుగుబాటు ఖర్చులలో 45 రోజులకు సమానమైనదిగా పరిగణించవలెను.

**14. పెట్టుబడి ప్రణాళిక:**

14.1 నియంత్రణ వ్యవధి ప్రారంభంలో రెగ్యులేటెడు రేటు బేస్ (ఆర్.ఆర్.బి.) ని నిర్ధారించుటకై నిబంధనలోని 9వ ఖండము యొక్క నిబంధనల ప్రకారం, మండలి వనరుల ప్రణాళికలోని భాగంగా ఆమోదించిన మూలధన పెట్టుబడి ప్రణాళికను తీసుకొనవలెను:

అయితే, మొదటి నియంత్రణ వ్యవధిలో, ప్రసారణ అనుమతిదారు, నియంత్రణ వ్యవధికి గాను తన మూలధన పెట్టుబడి ప్రణాళికను బహుళ వార్షిక దఖళ్ళలో భాగంగా మండలి ఆమోదము కొరకు దాఖలు చేయవలెను.

14.2 ప్రసారణ అనుమతిదారు, పెట్టుబడిని ఆమోదించడంపై మార్గదర్శకాల ప్రకారం, మూలధన పెట్టుబడి ప్రణాళికలో వ్యక్తిగత పథకాల కొరకు పెట్టుబడిని పెట్టుటకు కనీసం 90 రోజుల ముందుగా ఆమోదమును కోరవలెను. మండలి ఆమోదము కొరకు ప్రసారణ అనుమతిదారు సమర్పించిన వ్యక్తిగత పథకాలు/ప్రోజెక్టులలో నియంత్రణ వ్యవధిలో ప్రతి సంవత్సరానికి ఖర్చులు మరియు క్యాపిటలైజేషనుకు సంబంధించిన వాటితో సహా పూర్తి వివరములను తెలుపవలెను.

14.3 ప్రసారణ అనుమతిదారు, నియంత్రణ వ్యవధిలోని తదుపరి సంవత్సరములకు సమర్పించిన ఏ.ఆర్.ఆర్.లలో మూలధన పెట్టుబడి ప్రణాళికలో భాగంగా ఆమోదించిన పెట్టుబడుల నుండి ఉల్లంఘన జరిగినంత మేరకు, మండలి ఏ.ఆర్.ఆర్.లో దిద్దుబాట్లు చేయవచ్చును. మూలధన పెట్టుబడి ప్రణాళిక నుండి ప్రతి వ్యక్తిగత పథకము/ప్రోజెక్టులో 10 శాతమునకు మించిన ఉల్లంఘన మరియు ఏవేని ఇతర ముఖ్య ఉల్లంఘనల గురించి పంపిణీ అనుమతిదారు తగిన కారణములను చూపవలెను. ఇందులో ప్రస్తుతం ఉన్న పథకాలు/ప్రోజెక్టులలో కొత్త పథకములు/ప్రోజెక్టులను చేర్చుట లేక బదులుగా ఉంచుట కూడా చేరి యుండును.

**15. తరుగుదల:**

తరుగుదలను ఈ క్రింది పద్ధతిలో లెక్కించవలెను:-

15.1 నియంత్రణ వ్యవధిలోని ప్రతి సంవత్సరానికీ, తరుగుదలను, నియంత్రణ వ్యవధిలోని ప్రతి సంవత్సరం ప్రారంభంలో ఆర్.ఆర్.బి.లో చేర్చిన స్థిరాస్తుల ప్రారంభ ధర మొత్తముపై లెక్కించవలెను:

అయితే, వినియోగదారు/వాడకందారు ఇచ్చిన చందాలు లేక ఏదేని పెట్టుబడి సబ్సిడీ/గ్రాంటు వంటి వాటి ద్వారా వచ్చిన ఆస్తులపై తరుగుదలను పంపిణీ అనుమతిదారుని ఆదాయ అవసరంలో అనుమతించరాదు.

**15.2** నియంత్రణ వ్యవధిలోని ప్రతి సంవత్సరానికి తరుగుదల అలవెన్సును, సాధారణంగా కేంద్ర విద్యుత్ నియంత్రణ మండలి నిర్ణయించిన పద్ధతి, రేట్లు మరియు ఇతర నిబంధనల ఆధారంగా నిర్ధారించవలెను.

**15.3** తరుగుదలను, ఆస్తి వాడకంలోకి వచ్చిన తేదీ తరువాత వచ్చే సంవత్సరంలో ఏప్రియల్ 1వ తేదీ నుండి అనుమతించవలెను.

**16. ఆదాయంపై పన్నులు:**

**16.1** ప్రసారణ అనుమతిదారుని యొక్క అనుమతిపొందిన వ్యాపారంలోని ఆదాయంపై, ఆదాయపు పన్ను ఏదేని ఉన్నట్లయితే, దానిని ఖర్చుగా భావించి ఏ.ఆర్.ఆర్. ద్వారా వసూలు చేసుకొనవచ్చును.

**16.2** వాస్తవంగా చెల్లించవలసిన ఆదాయ పన్నులను చెల్లించి వాటిని ఏ.ఆర్.ఆర్.లో చేర్చవలెను. అయితే, దీనిని పెట్టిన పెట్టుబడిపై ప్రతిఫలంలో భాగమైన ఈక్విటీ ప్రతిఫలంపై పన్నుకు పరిమితం చేయవలెను. అట్టి ప్రతిఫలానికి మించిన ఏదేని ఆదాయంపై పన్నును, (అట్టి ప్రతిఫలం ప్రసారణ అనుమతిదారుని సామర్థ్యం మూలంగా లేక ఏ.ఆర్.ఆర్.లో ఏర్పరచిన ఏదేని ప్రోత్సాహకం కారణంగా రావచ్చును), జరిమానాలను, పన్ను ఆలస్యపు చెల్లింపుపై వడ్డీని మినహాయించవలెను. గత కాల వ్యవధులలో అందిన ఏవేని వాపసు చెల్లింపులకు వాటిని సర్దుబాటు చేయవలెను.

**16.3** నియంత్రింపజాలని అంశాల కారణంగా గత సంవత్సరాలలో ఖర్చు సర్దుబాట్ల ట్రూ-అప్ ద్వారా వచ్చిన ఆదాయంపై పన్నును కూడా వాస్తవాల ఆధారంగా పాస్-త్రూగా పరిగణించవలెను. అయితే, ఆ విధంగా క్లెయిము చేసిన పన్ను మరియు ట్రూ-అప్ కు సంబంధించిన సంవత్సరాలలో ఇంతకు ముందే అనుమతించిన పన్ను కలిపి, ఖండము 16.2 లో నిర్దిష్ట పరచిన పరిమితికి గత సంవత్సరాలలో ఇంతకు ముందే ఏర్పరచిన పన్నుకు గాను సర్దుబాటు చేసిన మొత్తమునకు మించరాదు.

**17. "నియంత్రింపజాలని" అంశములు మరియు "నియంత్రించగల" అంశముల కొరకు దిద్దుబాట్లు మరియు "నియంత్రించగల" అంశములలో లాభములు/నష్టములను పంచుకొనుట:**

ప్రసారణ అనుమతిదారు, ఏ.ఆర్.ఆర్.లోని "నియంత్రింపజాలని" అంశములు మరియు "నియంత్రించగల" అంశములలోని వ్యత్యాసములపై లాభనష్టముల యొక్క పాస్-త్రూ కొరకు అదే విధంగా పంచుకొనుటకు, ఈ నిబంధనలోని 10వ ఖండము ప్రకారం ప్రతిపాదనలను దాఖలు చేయవలెను.

**18. పనితీరు సూచికలపై ప్రోత్సాహం/జరిమానా:**

**18.1** ప్రసారణలోని నష్టాల కొరకు మండలి నిర్ధారించు విధముగా ప్రోత్సాహకము/జరిమానాలు వర్తించును. ఆమోదించబడిన శ్రేణి కంటే క్రింది స్థాయిలో నష్టాలకు ప్రోత్సాహకము ఉండవలెను. అట్టి ప్రోత్సాహకమును తదుపరి నియంత్రణ వ్యవధికి సంబంధించిన ఏ.ఆర్.ఆర్.కు చేర్చవలెను. అదేవిధంగా, ఆమోదించబడిన శ్రేణి కంటే మించి వాస్తవంగా ప్రసారణ నష్టాలు వచ్చినప్పుడు దానికి జరిమానా ఉండవలెను. అట్టి జరిమానాను తదుపరి నియంత్రణ వ్యవధికి సంబంధించిన ఏ.ఆర్.ఆర్. నుండి తగ్గించవలెను.

**18.2** మండలి కూడా, అప్పుడప్పుడు, ప్రసారణ వ్యవస్థ అందుబాటు, నాణ్యమైన లక్ష్యాలు మొదలగు వాటితో సహా ఏవేని ఇతర పనితీరు సూచికలను నిర్దిష్టపరచవచ్చును. వీటి కొరకు జరిమానా లేక ప్రోత్సాహకములను ఏ.ఆర్.ఆర్. దరఖాస్తులో చేర్చవలసి యుండును:

అయితే, ఈ నష్టాలలో ముఖ్యమైన కాలానుగుణ వ్యత్యాసములు ఉన్నట్లయితే, అనుమతిదారు, సంవత్సరంలోని సంబంధిత వ్యవధులలో ప్రసారణ నష్టాల స్థాయిలను మండలి ఆమోదము కొరకు సమర్పించవచ్చును:

అంతేకాక, పై నిబంధనల ప్రకారం, మండలి విధించిన జరిమానా మొత్తము ఏదైనా ఉన్నట్లయితే, అది ఈక్విటీపై ప్రతిఫలములో 10% నకు మించరాదు.

**19. ట్యారిఫ్ యేతర ఆదాయము:**

ఆస్తుల అమ్మకం వలన వచ్చిన లాభము, పెట్టుబడులు, అద్దెల నుండి వచ్చిన ఆదాయము, ప్రసారణ వ్యవస్థను అతిగా లేక తక్కువగా వినియోగించుకొనుట మూలంగా జరిమానాల రూపంలో వచ్చిన ఆదాయం మరియు వాడకందారుల నుండి వచ్చిన వివిధ మొత్తములు వంటి వాటితో సహా, అనుమతిదారుని యొక్క వనరుల నుండి ప్రసారణ వ్యాపారానికి అనుబంధమైన ఆదాయమంతా ట్యారిఫ్ యేతర ఆదాయముగా ఉండును.

**20. ప్రసారణ ట్యారిఫ్:**

**20.1** ప్రసారణ వ్యవస్థను వినియోగించుకొనే వాడకందార్లు చెల్లించవలసిన ప్రసారణ ట్యారిఫ్‌ను ఈ క్రింది ఫార్ములా ప్రకారం నిర్ధారించవలెను:-

టి.ఆర్. = నెట్ ఏ.ఆర్.ఆర్. / (12 * టి.సి.సి.)

ఇందులో, -

టి.ఆర్. = ప్రసారణ రేటు నెలకు, కి.వా.కు రూపాయలలో (రూ./కి.వా./నెల)

నెట్ ఏ.ఆర్.ఆర్. = ఖండము 8.3 లో నిర్ధారించిన నెట్ (నికర) ఏ.ఆర్.ఆర్.

టి.సి.సి. = దీర్ఘకాలిక వాడకందారులు కుదుర్చుకొన్న ప్రసారణ వ్యవస్థ మొత్తం ఒప్పందపు సామర్థ్యం - కిలోవాట్లలో

**20.2** ప్రతి ప్రసారణ వాడకందారు (పంపిణీ అనుమతిదారులతో సహా) ఓపెన్ యాక్సెస్ నిబంధన ప్రకారం అనుమతిదారునితో కుదుర్చుకొన్న ఒప్పందపు సామర్థ్యాన్ని తగు విధంగా తెలుపుతూ ఒక ఒప్పందమును కుదుర్చుకొనవలెను. ప్రసారణ వాడకంలో వ్యత్యాసాల మూలంగా ఆమోదించబడిన ఆదాయ అవసరంపై వచ్చిన రెవెన్యూ వసూలులోని వ్యత్యాసాలను తదుపరి నియంత్రణ వ్యవధిలో వ్యత్యాసాలకు సంబంధించిన సంవత్సరంలో అప్పుచేయు సగటు రేటుపై ఆర్థిక ఖర్చుతో సర్దుబాటు చేయబడును.

**21. వేలం (బిడ్డింగ్) ప్రక్రియ ద్వారా ట్యారిఫ్ నిర్ధారణ:**

**21.1** ఈ నిబంధనలో ఏమి ఉన్నప్పటికినీ, మండలి, చట్టము యొక్క 63వ పరిచ్ఛేధము క్రింద కేంద్ర ప్రభుత్వముచే జారీ చేయబడిన మార్గదర్శకాలననుసరించి పారదర్శకమైన వేలం (బిడ్డింగు) ప్రక్రియ ద్వారా ఏదేని ప్రసారణ వ్యవస్థకు/నెట్‌వర్కుకు లేక అందలి భాగము కొరకు ట్యారిఫ్ నిర్ధారణ జరిగినట్లయితే, అట్టి ప్రసారణ ట్యారిఫ్‌ను అంగీకరించవలెను.

## భాగము – IV

## ఇతర విషయములు

**22. నియతకాలిక సమీక్షలు:**

బహుళ వార్షిక ట్యారిఫ్ (ఎమ్.వై.టి.) వ్యవస్థను సజావుగా అమలుపరచేందుకు వీలుగా మండలి, నియంత్రణ వ్యవధిలో పంపిణీ అనుమతిదారుని పనితీరుకు సంబంధించి నియతకాలికంగా సమీక్షలు జరుపవచ్చును. ఇందులో ఆచరణ సాధ్యమైన సమస్యలను, అనూహ్యంగా సంభవించే పరిణామాలను పరిష్కరించవచ్చును. సాధారణంగా బహుళ వార్షిక ట్యారిఫ్ సూత్రాల ప్రయోజనములను అంచనా వేయవచ్చును.

**23. నియంత్రణ వ్యవధి ముగింపు సమీక్ష:**

**23.1** నియంత్రణ వ్యవధి చివరిలో, ఈ నిబంధనలో తెలిపిన సూత్రాల అమలు వలన ఆశించిన లక్ష్యాలు నెరవేరినవా అను దానిపై మండలి సమీక్షను జరుపవచ్చును. ఆవిధంగా చేయునప్పుడు, మండలి, ఇతర విషయాలతో పాటుగా, పరిశ్రమ స్వరూపమును, ఆ రంగంలో ఆవశ్యకతలను, వినియోగదారుల, ఇతర లబ్దిదారుల అంచనాలను మరియు ఆ సమయంలో పంపిణీ అనుమతిదారుల ఆవశ్యకతలను పరిగణనలోనికి తీసుకొనవలెను. ఆ రంగంలో ఆవశ్యకతలను బట్టి, చట్టము యొక్క లక్ష్యాలను సాధించుటకు మండలి, తదుపరి నియంత్రణ వ్యవధు (ల) కొరకు నియమాలను సవరించవచ్చును.

**23.2** మొదటి నియంత్రణ వ్యవధి ముగింపు, రెండవ నియంత్రణ వ్యవధికి ప్రారంభము కావలెను. మండలి, సముచితమైన ఉత్తరువులు/ఆదేశముల ద్వారా ఇతర విధంగా కోరిననే తప్ప, ప్రసారణ అనుమతిదారు నిర్ణీత పరచిన అదే కార్యవిధానమును అనుసరించవలెను. మండలి, రెండవ నియంత్రణ వ్యవధి మరియు ప్రతి తదుపరి నియంత్రణ వ్యవధి ప్రారంభములో ఏర్పరచిన లక్ష్యాలకు సంబంధించి ప్రసారణ అనుమతిదారు యొక్క పనితీరును విశ్లేషించవలెను. వాస్తవ పనితీరు, ఆశించిన సామర్థ్యంలో పెరుగుదలలు మరియు ఇతర సంబంధిత విషయాల ఆధారంగా తదుపరి నియంత్రణ వ్యవధికి ప్రారంభ విలువలను నిర్ధారించవలెను.

**24. సవరణ చేయుటకు అధికారము:**

మండలి ఎప్పుడైననూ, ఈ నిబంధనలలో దేనినైననూ చేర్చవచ్చును, మార్చవచ్చును, సరిదిద్దవచ్చును, తొలగించవచ్చును లేక సవరించవచ్చును.

**25. మినహాయింపు:**

**25.1** ఈ నిబంధనలో ఉన్నదేదియూ, న్యాయము చేయుటకు లేక మండలి కార్య ప్రక్రియను దురుపయోగము కాకుండా చూచుటకు అవసరమైన ఉత్తరువులను జారీచేయుటలో మండలికి ఉన్న అధికారమును పరిమితముగా లేక ఇతర విధమైన ప్రభావమును చూపునదిగా భావించరాదు.

**25.2** కొన్ని విషయాలలో ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా, మండలి వ్రాత పూర్వకంగా తెలియజేసే కారణాలను బట్టి, అట్టి విషయాలలో వ్యవహరించుటకు అవసరము లేక ఉపయుక్తమని మండలి భావించిన యెడల, అవి ఈ నిబంధనలకు వ్యతిరేకముగా ఉన్నప్పటికినీ, చట్టపు నిబంధనలకు అనుగుణముగా ఉన్న ఒక కార్య విధానమును అనుసరించుటకు, ఈ నిబంధనలో నున్నదేదియూ మండలిని నివారించదు.

**25.3** చట్టము క్రింద ఏదేని విషయములో వ్యవహరించుటకు లేక ఏదేని అధికారమును వినియోగించుటకు, ఈ విషయంలో నిబంధన ఏదియూ లేనప్పటికీ, ఈ నిబంధనలో నున్నదేదియూ వ్యక్తపరచుటద్వారాగాని లేక అంతర్నిహితంగా గాని మండలిని నివారించదు. అట్టి విషయాలలో మండలి, తాను సబబని భావించినట్టి రీతిలో అట్టి అధికారములను వినియోగించవచ్చును లేక అట్టి కర్తవ్యములను నిర్వర్తించవచ్చును.

(మండలి యొక్క ఉత్తరువు ద్వారా జారీచేయబడినది)

ఎస్. సూర్యప్రకాశరావు

కార్యదర్శి

**గమనిక:** నిబంధన యొక్క ఈ తెలుగు అనువాదము ప్రజా సౌకర్యం నిమిత్తం చేసిన స్వేచ్ఛానువాదం మాత్రమే. అధికారిక పాఠం కాదు.